సాక్షి
ఖమ్మం
బుధవారం । 18 । అక్టోబర్ । 2023



ఆన్‌లైన్ చెల్లింపులకు ప్రాధాన్యం
విద్యుత్ వినియోగదారులు ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించేలా అవగాహన కల్పించాలని అధికారులు నిర్ణయించారు.
10లో



గ్రామాల్లో కేంద్ర అధికారులు
కేంద్రప్రభుత్వ పరిధిలోని ఏఎస్‌ఓలు సంక్షేమ పథకాల అమలును పరిశీలించేందుకు గ్రామాల్లో పర్యటిస్తున్నారు.
10లో

గరిష్టం / కనిష్టం
35° / 24°

వాతావరణం
జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అంతటా ఉదయం నుంచే ఎండ ప్రభావం కనిపిస్తుంది.

సమన్వయం..బుజ్జగింపులు



సమన్వయ సమావేశం తర్వాత మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్, పక్కన ఎంపీలు నామ, రవిచంద్ర, ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యేలు సండ్ర, రాములునాయక్, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ తదితరులు



రాయల నాగేశ్వరరావుతో భేటీ అయిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నాయకులు

- ఖమ్మం కేంద్రంగా బీఆర్‌ఎస్ కార్యాచరణ
- పదిహేను మందితో తెరపైకి సమన్వయ కమిటీ
- పార్టీలో చేరికలు, సీఎం సభల పర్యవేక్షణ బాధ్యతలు
- పాలేరులో కాంగ్రెస్ నేతకు పొంగులేటి బుజ్జగింపు
- రాయల నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి మంతనాలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: బీఆర్‌ఎస్‌లో నేతల సమన్వయం, కాంగ్రెస్‌లో ఆశావహులకు బుజ్జగింపులతో ఖమ్మం కేంద్రంగా రాజకీయం వేడెక్కింది. సీఎం సభల పర్యవేక్షణ, చేరికలు, పార్టీని ఎవరూ వీడకుండా పర్యవేక్షించేందుకు బీఆర్‌ఎస్‌లో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ తెరపైకి వచ్చింది. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా సమన్వయ బాధ్యతలు అప్పగించినా... జిల్లాస్థాయి కమిటీ అన్ని నియోజకవర్గాల్లో పర్యవేక్షించేలా నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నేతృత్వాన ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు, పార్టీ అభ్యర్థులు దీనిపై ప్రధానంగా చర్చించినట్లు తెలిసింది. మరోవైపు పార్టీ టికెట్ రాదన్న కారణంతో అసంతృప్తితో ఉన్న పాలేరు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేత రాయల నాగేశ్వరరావుతో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మంలోని ఆయన నివాసానికి వెళ్లి మంతనాలు జరిపారు. అలాగే మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నగర పార్టీ అధ్యక్షుడు జావేద్ ఇంటికి వెళ్లి చర్చించారు.

పది నుంచి పదిహేను మంది

రెండు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కేఎంసీకి చెందిన ముగ్గురు కార్పొరేటర్లు, మరో ఇద్దరు మాజీ కార్పొరేటర్లు, పలువురు నేతలు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో అలర్ట్ అయిన బీఆర్‌ఎస్ నేతలు అధిష్టానం సూచనలతో అలాంటి వారిపై నిఘా పెట్టడమే కాక పార్టీ ప్రచారం, సమావేశాలు, సీఎం సభలు, బుజ్జగింపుల కోసం జిల్లాస్థాయి సమన్వయ కమిటీ ఏర్పాటుకు నిర్ణయించారు. ఈ కమిటీ తమకు అందిన సమాచారాన్ని నియోజకవర్గాల బాధ్యులతో పంచుకోవాలని నిర్ణయించారు. అలాగే, చేరికలపై దృష్టి పెట్టి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులు, సిట్టింగ్ ఎమ్మెల్యేల సమన్వయంతో వేగిరం చేయనున్నట్లు సమాచారం. నియోజకవర్గ సమన్వయ బాధ్యతలు లేని జిల్లాకు చెందిన పది మంది లేదా పదిహేను మంది ముఖ్యనేతలతో ఈ కమిటీని వేయాలని నిర్ణయించారు.

కార్యకర్తలతో మాట్లాడాకే..

పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ తనకే వస్తుందని రాయల నాగేశ్వరరావు భావిస్తున్నారు. సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క అనుచరుడైన ఆయన టికెట్‌పై ధీమాగా ఉండగా.. ఇటీవలి రాజకీయ పరిణామాలతో పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో రాయల అసంతృప్తికి గురికాగా.. భట్టితో భేటీ అయి తుది నిర్ణయం తీసుకోవాలనే భావనకు వచ్చినట్లు తెలిసింది. ఈమేరకు ఖమ్మంలోని రాయల ఇంటికి పొంగులేటి వెళ్లి కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్న సమయాన రాయల పాలేరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారని, ఆయనకు పార్టీతో పాటు తాను కూడా అండగా ఉంటానని పొంగులేటి మీడియా ముఖంగా చెప్పారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు నియోజకవర్గ పరిస్థితులపై చర్చించారు. అయితే తనకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క హామీ ఇవ్వడంతో పార్టీ బలోపేతానికి కృషి చేయడమే కాక కార్యకర్తలను కాపాడుకున్నానని రాయల అన్నట్లు తెలిసింది. ఈ విషయమై రేవంత్‌రెడ్డి, భట్టి తనకు సమాధానం చెప్పాక కార్యకర్తలతో చర్చించి నిర్ణయం వెల్లడిస్తానని పేర్కొన్నట్లు సమాచారం. ఇక ఖమ్మం నుంచి పోటీకి మాజీ మంత్రి తుమ్మలకు అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఆయన కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావేద్ ఇంటికి వెళ్లి మాట్లాడారు. మైనార్టీ కోటాలో కాంగ్రెస్ టికెట్ వస్తుందని భావించిన జావేద్‌కు తుమ్మల చేరికతో చుక్కెదురైన నేపథ్యాన ఆయనతో చర్చించారు.

'గుండాల'.. గరంగరం

బీఆర్‌ఎస్‌లో జరుగుతున్న పరిణామాలపై పార్టీ నాయకుడు గుండాల కృష్ణ అసహనంతో ఉన్నట్లు సమాచారం. ఇటీవల మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పార్టీ మారే క్రమంలో ఎమ్మెల్సీ, జిల్లా అధ్యక్షుడు తాతా మధుపై విమర్శలు చేశారు. పార్టీ రాష్ట్రస్థాయి పదవి, జిల్లా అధ్యక్ష పదవి, ఎమ్మెల్సీ, భద్రాచలం సమన్వయ బాధ్యతలు ఆయనకే ఇచ్చారని పేర్కొన్నారు. అయితే, బీసీలకు ఓ వైపు ముఖ్యమంత్రి ప్రాధాన్యత ఇస్తుంటే.. జిల్లాలో అలా జరగడం లేదని కృష్ణ అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. బాలసాని చేసిన వ్యాఖ్యలపై జిల్లా అధ్యక్షుడిగా మధు స్పందించకపోవడం సరికాదనే భావనతో ఉన్నట్లు తెలిసింది. ఇదే విషయాన్ని ఆయన విలేకరుల సమావేశం ముగిశాక మీడియా ప్రతినిధుల సమక్షాన బహిరంగంగానే చెప్పడం గమనార్హం.

జంగ్ తెలంగాణ

న్యూస్‌రీల్

అన్నపూర్ణాదేవి రూపంలో అమ్మవారు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు మంగళవారం మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా అర్చకులు స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించాక యాగశాలలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాల వద్ద పూజలు చేశారు. ఆతర్వాత అలివేలు మంగ అమ్మవారిని అన్నపూర్ణాదేవి అవతారంలో అలంకరించాక భక్తులు దర్శించుకున్నారు. ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్ర మూర్తి, అర్చకులు ఉప్పల విజయదేవశర్మ, ఉప్పల మురళీమోహన్‌శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి పాల్గొన్నారు.

పాత భవనంలోకి దేవాదాయ శాఖ కార్యాలయం

ఖమ్మంగాంధీచౌక్: కలెక్టరేట్‌లో కొనసాగుతున్న ఉమ్మడి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాన్ని గతంలో ఖమ్మం కాల్వొడ్డులో నిర్వహించిన పాత భవనంలోకి మంగళవారం మార్చారు. బుధవారం నుంచి కాల్వొడ్డులోని శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవాలయం పక్కన ఉన్న పాత భవనంలోనే కార్యాలయ కలాపాలు కొనసాగుతాయని ఉమ్మడి ఖమ్మం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఏ.సులోచన ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో కార్యాలయానికి కేటాయించిన బ్లాక్‌లో నిర్వహణ ఇబ్బందికరంగా ఉందని కలెక్టర్‌కు విన్నవించగా ఆయన పాత భవనంలోకి కార్యాలయాన్ని మార్చేందుకు అనుమతించారు. దీంతో మంగళవారం కార్యాలయ సామగ్రిని తరలించారు.

ఎంపీహెచ్‌డబ్ల్యూలో ప్రవేశాలకు దరఖాస్తులు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మంలోని ప్రభుత్వ ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఫీమేల్) ట్రైనింగ్ స్కూల్‌లో మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మాలతి తెలిపారు. ఇంటర్, తత్సమాన కోర్సులు పూర్తి చేసి, 30 ఏళ్లలోపు వయస్సు కలిగిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముండగా, వివరాల కోసం ప్రభుత్వ ఆస్పత్రిలోని ఎంపీహెచ్‌డబ్ల్యూ ట్రైనింగ్ స్కూల్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

కొనసాగుతున్న పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన మంగళవారం పదో తరగతి పరీక్షకు 236మందిలో 200మంది, ఇంటర్ పరీక్షకు 252మందికి గాను 198మంది హాజరయ్యారు. అభ్యర్థులకు ఇబ్బంది ఎదురుకాకుండా కేంద్రాల్లో ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ ఈ.సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు.

డీసీసీబీ సీఈఓ పోస్టుకు ఇంటర్వ్యూలు పూర్తి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) సీఈఓ(ముఖ్య కార్య నిర్వహణాధికారి) నియామకానికి సంబంధించి మంగళవారం హైదరాబాద్‌లోని టెస్కాబ్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. సీఈఓ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న 12 మంది అభ్యర్థులు హాజరుకాగా, టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావుతో కూడిన బృందం ఇంటర్వ్యూలు నిర్వహించింది. వడపోత అనంతరం నలుగురి అభ్యర్థులను ఎంపిక చేయగా... ఇందులో ఒకరికి సీఈఓగా నియమించే అవకాశముందని సమాచారం. నిజామాబాద్, హైదరాబాద్ డీసీసీబీ సీఈఓ పోస్టులకు కూడా ఇంటర్వ్యూలు నిర్వహించాక మూడు రోజుల్లో తుది జాబితా వెల్లడించే అవకాశముందని తెలిసింది.

నేటి నుండి దసరా లక్కీ డిప్

ఖమ్మం మామిళ్లగూడెం: బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించేలా ప్రవేశపెట్టిన లక్కీ డిప్ బుధవారం నుంచి ప్రారంభమవుతుందని ఖమ్మం డిపో మేనేజర్ బి.శ్రీనివాస్ తెలిపారు. ఖమ్మం డిపోలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఈనెల 18నుండి 30వ తేదీ వరకు బస్సుల్లో వచ్చివెళ్లే వరకు ప్రయాణం పూర్తయ్యాక టికెట్ వెనకాల పేరు, ఫోన్ నంబర్ రాసి బస్టాండ్లలోని బాక్సుల్లో వేయాలని సూచించారు. అనంతరం ప్రతీ రీజియన్‌లో 10 మంది చొప్పున విజేతలను ఎంపిక చేసి నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

కౌంటింగ్ కేంద్రంలో పకడ్బందీగా ఏర్పాట్లు



గోదాంలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, అధికారులు

రఘునాథపాలెం: ఎన్నికల అనంతరం ఓట్ల లెక్కింపు కోసం మండలంలోని జింకల తండా గోదాంల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. గోదాంలను మంగళవారం ఆయన పరిశీలించి బారికేడ్లు, భోజన సౌకర్యం, పార్టీ ఏజెంట్లు, మీడియా గ్యాలరీ ఏర్పాట్లపై సూచనలు చేశారు. అలాగే, వాహనాల పార్కింగ్‌కు అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని తెలిపారు. గోదాంల ఆవరణలోని పిచ్చిమొక్కలు తీయించాలని తహసీల్దార్ లూథర్ విల్సన్‌ను ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్యాంప్రసాద్, ఉద్యోగులు సత్యనారాయణ, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఏన్కూరు: మండలంలోని గార్లఒడ్డు, నూకాలంపాడు, మేడేపల్లి, మునియతండాల్లో పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తహసీల్దార్ శేషగిరిరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కృష్ణ, ఆర్‌ఐ నవీన్ పాల్గొన్నారు.



కేంద్రంలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

ఖమ్మంకు పెద్దపీట వేసిన కేసీఆర్

- ఉమ్మడి జిల్లా ప్రజలు అభివృద్ధి వైపు నిలబడాలి
- 60 ఏళ్లలో చేయలేని కాంగ్రెస్ ఇప్పుడు చేస్తుందా?
- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ మునుపెన్నడూ లేని విధంగా ఒక్కో నియోజకవర్గానికి రూ.వేల కోట్ల నిధులు మంజూరు చేశారని రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లక్షన్నర మందికి పోడుపట్టాలు ఇచ్చిన కేసీఆర్‌తో పాటు బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని కోరారు. ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్రతో కలిసి ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని, ఇదే సమయాన ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం ఉండేలా పదికి పది స్థానాల్లో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే తమ ప్రధాన ప్రత్యర్థి అని తెలిపారు. గత అరవై ఏళ్లలో చేయలేని అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ ఇప్పుడు చేస్తుందా అనే విషయమై ప్రజలు ఆలోచించాలని కోరారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోకు మంచి స్పందన వస్తోందని, తాము అమలుచేస్తున్న పథకాలనే కాంగ్రెస్ కాపీ కొట్టిందని తెలిపారు.

సంక్షేమంలో తెలంగాణ ప్రథమం

ఎంపీ నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక పదేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందని తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. సీఎం కేసీఆర్‌కు పేదలు, రైతుల కష్టాలు తెలిసినందునే ఆయా పథకాలు అమలుచేస్తున్నారని తెలిపారు. ఆరు గ్యారంటీలతో ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తున్న కాంగ్రెస్‌ను నమ్మొద్దని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు, పార్టీ అభ్యర్థులు సండ్ర వెంకటవీరయ్య, రాములు నాయక్, లింగాల కమల్‌రాజ్, బానోత్ మదన్‌లాల్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, నాయకులు గుండాల కృష్ణ, ఉప్పల వెంకటరమణ, పగడాల నాగరాజు, డోకుపర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కురుక్షేత్ర యుద్ధానికి సమయం ఆసన్నమైంది

- తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను కోరుకుంటున్నారు
- కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: బీఆర్‌ఎస్ నేతల ఇళ్లకు బందిపోటుల్లా వెళ్లామని మంత్రి పువ్వాడ అజయ్ అనడం హాస్యాస్పదమని... తాము పట్టపగలు కార్లలో వారి ఇళ్లకు వెళ్లి పార్టీలోకి ఆహ్వానించామని మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మంలో పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావును కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కురుక్షేత్ర యుద్ధానికి సమయం ఆసన్నమైందని, ప్రజలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. గడిచిన తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన ఏ హామీని అమలుచేయని విషయాన్ని అందరూ గుర్తించారని తెలిపారు. ప్రభుత్వ అసమర్థతతో యువతీ, యువకులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. రెండు, మూడు రోజుల్లో మిగిలిన అభ్యర్థుల జాబితా వెలువడుతుందని పొంగులేటి తెలిపారు. కాగా, ములుగులో బుధవారం నుంచి కాంగ్రెస్ పార్టీ బస్సుయాత్ర మొదలవుతుందని, ఇందులో ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పాల్గొంటారని చెప్పారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించిన వారు ఇప్పుడే హామీలను మేనిఫెస్టోలో చేర్చారని ఎద్దేవా చేశారు. కష్టకాలంలో పాలేరులో పార్టీని అంటిపెట్టుకుని ఉన్న రాయల నాగేశ్వరరావుకు అండగా ఉంటానని ఆయన తెలిపారు. త్వరలోనే వందలాది మంది సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్‌లో చేరనున్నారని చెప్పారు. రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇతర నాయకులు సమన్వయంతో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేలా కృషి చేస్తామని, పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబుతో పాటు నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, మద్దినేని బేబి స్వర్ణకుమారి, కొంగర జ్యోతిర్మయి పాల్గొన్నారు.



ప్లకార్డులతో కూడిన బతుకమ్మల వద్ద కలెక్టర్ గౌతమ్, అధికారులు

ఎన్నికల బతుకమ్మ ఉయ్యాలో!

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యాన కలెక్టరేట్‌లో మంగళవారం బతుకమ్మ వేడుకలను వినూత్నరీతిలో నిర్వహించారు. ఓటు నమోదు ప్రాముఖ్యత, ఓటుహక్కు వినియోగం ఆవశ్యకతను వివరిస్తూ నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ ప్రతీఒక్కరు ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీఓలు జి.గణేష్, అశోక్ చక్రవర్తి, ఎస్‌డీసీ రాజేశ్వరి, డీడబ్ల్యూఓ సుమ, డీఆర్డీఓ విద్యాచందన, ఉద్యోగులు పాల్గొన్నారు.

– ఖమ్మం సహకారనగర్

అంతా సాఫీగా సాగుతోందా ?!

ఖమ్మం సహకారనగర్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ గౌతమ్ మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. కంట్రోల్ రూమ్‌లోని నంబర్లకు వస్తున్న ఫిర్యాదులు, పరిష్కారంపై ఆరా తీశారు. సీవిజిల్ యాప్‌కు 72, 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు 343 ఫిర్యాదులు వచ్చాయని ఉద్యోగులు తెలిపారు. ఆతర్వాత చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల పుటేజీని కలెక్టర్ పరిశీలించారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్, సీపీఓ ఏ.శ్రీనివాస్, సూపరింటెండెంట్లు మదన్‌గోపాల్, రంజిత్ పాల్గొన్నారు.



సీసీ కెమెరా పుటేజీని పరిశీలిస్తున్న కలెక్టర్

విద్యా ప్రమాణాల పెంపునకు పాటుపడాలి

హెచ్‌ఎంల సన్మాన సభలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఖమ్మంసహకారనగర్: ఏళ్ల తర్వాత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టులు భర్తీ చేసిన నేపథ్యాన విద్యార్థుల సంఖ్య, విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సూచించారు. ఇటీవల పదోన్నతి పొందిన హెచ్‌ఎంల అభినందన సభను ఖమ్మంలోని యూటీఎఫ్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేయగా ఎమ్మెల్సీ మాట్లాడారు. విద్యాశాఖాధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తే కోర్టు కేసులన్నింటినీ అధిగమించి పదోన్నతులు సాధించుకోవటం సాధ్యమయ్యేదని, కానీ అధికారుల నిర్లక్ష్యంతో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఆగిందని తెలిపారు. ఎస్‌జీటీలు, పండిట్ల పదోన్నతులు, బదిలీలు నిలిచిపోవడంతో విద్యారంగానికి నష్టమని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగియగానే ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, పదోన్నతులపై దృష్టి సారించాలని కోరారు. ఆ తర్వాత హెచ్‌ఎంలకు సర్వీస్ రూల్స్, పాఠశాల నిర్వహణపై టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, కార్యదర్శి ఎ.వెంకట్ అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

పాలకుల వైఖరితో నష్టం

పాలకుల వైఖరితో ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం జరుగుతోందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య పేర్కొన్నారు. సీఎం గతంలో అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలు అమలు చేయడమే కాక పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీఈఓ సోమశేఖరశర్మ, డీసీఈబీ కార్యదర్శి నారాయణ మాట్లాడగా, సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావుతోపాటు చావా దుర్గాభవాని, షేక్ మహబూబ్ అలీ, పారుపల్లి నాగేశ్వరరావు, మురళీకృష్ణ వెంకన్న, షేక్ షమీ, వల్లంకొండ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన ఎన్నికల ఏర్పాట్లు

ఖమ్మం సహకారనగర్: ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో సమావేశమయ్యారు. మొదటి విడత ర్యాండమైజేషన్ తర్వాత ఈవీఎంలను నియోజకవర్గాలకు కేటాయిస్తామని, ఆలోగా స్ట్రాంగ్ రూంలు సిద్ధం చేయాలని తెలిపారు. నామినేషన్ల విత్ డ్రా పూర్తయ్యాక ఈవీఎంల కమీషనింగ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే, పీఓలు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమాలను ఈనెల 28 నుండి ప్రారంభించాలని చెప్పారు.

వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలి

ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతీ అభ్యర్థి వ్యయం వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో అకౌంటింగ్ బృందాలకు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అభ్యర్థుల వివరాలను నమోదు చేయాలని, ఇందుకోసం ఫ్లెక్సీలు, బ్యానర్లు, కరపత్రాలు, ప్రచార ప్రకటనలే కాక వీఐపీలు పాల్గొనే సభలకు వెచ్చించే వ్యయాన్ని నిశితంగా పరిశీలించాలని తెలిపారు. అలాగే, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ఎన్నికల కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే సమయాన అనుమతి తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీసీఓ విజయకుమారి, డీపీఓ విజయ నిర్మల, జిల్లా ఉపాధికల్పనాధికారి శ్రీరామ్, ఆర్డీఓలు జి.గణేష్, అశోక్‌చక్రవర్తి, ఎస్‌డీసీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్చరీ పోటీల్లో స్వర్ణ పతకం


హస్న

ఖమ్మం స్పోర్ట్స్: తమిళ నాడులో జరుగుతున్న సీబీఎస్ఈ పాఠశాలల క్రీడా పోటీల్లో ఆర్చరీ విభాగంలో ఖమ్మం హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఎస్.కే.హస్న స్వర్ణపతకం గెలుచుకుంది. ఇండియన్ రౌండ్‌లో అండర్–14 బాలికల విభాగం నుంచి పాల్గొన్న ఆమె అత్యధికంగా 310పాయింట్లు సాధించడంతో పతకం దక్కింది. ఈసందర్భంగా హసన్నను డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్ రెడ్డి, హార్వెస్ట్ స్కూల్ కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డి, కోచ్ నగేష్ అభినందించారు.

చెరుకు రైతులు ఆర్థిక స్వావలంబన సాధించాలి

నేలకొండపల్లి: చెరుకు సాగుచేస్తున్న రైతులు ఆర్థిక స్వాలంబన సాధించాలని చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్ కోరారు. నేలకొండపల్లి మండలం ముద్రాజుపల్లిలో మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు సాగు చేస్తున్న రైతులకు మెళకువలు వివరించేందుకు మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ శాస్త్రవేత్తల సలహాల మేరకు యజమాన్య పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడి సాధించాలని తెలిపారు. కాగా, చెరుకు సాగు విస్తీర్ణం పెంచేలా ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ డీజీఎం కె.అప్పారావు, మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.12లక్షల విలువైన గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో మంగళవారం చేపట్టిన తనిఖీల్లో ఎక్సైజ్ పోలీసులు రూ.12లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యాన స్టేషన్ రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా బీహార్‌కు చెందిన చందన్‌కుమార్, జార్ఖండ్‌కు చెందిన కృష్ణబెహ్రా, మహారాష్ట్రకు చెందిన మనీషానానాసో, సోనా వానే, శాంతి బాయికాలే 51 కేజీల గంజాయితో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఎక్కే ప్రయత్నాల్లో ఉండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ సీఐలు రాజు, రాజిరెడ్డి, లతీఫ్, సర్వేశ్వర్, వెంకట్రామిరెడ్డి, ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, జీఆర్పీ ఎస్ఐ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఖమ్మంక్రైం: పాడుబడిన బావిలో గుర్తుతెలియని వ్యక్తి(35) మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఖమ్మం త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని పిసికె తోట ప్రాంతంలో మూసేసిన వేపకాయ మిల్లు వెనకాల పాడుబడిన బావి వద్దకు మంగళవారం పందిళ్లపల్లికి చెందిన ఉపేందర్ మూత్రవిసర్జనకు వెళ్లాడు. బావిలో చూడగా మృతదేహం తేలియాడుతూ కనిపించడంతో ఆయన మిల్లు యజమాని వెంపటి సత్యనారయణ, త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. కాగా, నాలుగు రోజుల క్రితం బావిలో పడి ఉన్నట్లు తెలుస్తుండగా మృతదేహం కుళ్లిపోయిందని త్రీటౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

తిరుమలాయపాలెం: మండలంలోని దమ్మాయిగూడెం సమీపాన మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కూసుమంచి మండలం పూర్యాతండాకు చెందిన గుగులోతు వీరు, భూక్యా శ్రీను మోటార్‌సైకిల్‌పై పాతర్లపాడు వైపు వెళ్తున్నారు. దమ్మాయిగూడెం సమీపాన వెనకనుండి వచ్చిన లారీ వీరిని ఢీకొట్టగా వీరు, శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను 108లో ఖమ్మం తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కారేపల్లిలో ఒకరికి...

కారేపల్లి: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఏపీలోని గుంటూరు జిల్లా భీమవరానికి చెందిన తల్లిశెట్టి శ్రావణ్ ద్విచక్రవాహనంపై ఇల్లెందు వైపు వెళ్తుండగా కారేపల్లి క్రాస్ వద్ద నర్సరీ నుంచి మధురానగర్‌తండాకు చెందిన గుగులోతు సురేందర్ ద్విచక్రవాహనంపై ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చాడు. దీంతో రెండు వాహనాలు ఢీకొనగా శ్రావణ్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడే తనిఖీలు చేపడుతున్న పోలీసులు ఆయనను 108లో ఖమ్మం తరలించారు.

మహిళ ఆత్మహత్య

ఖమ్మం క్రైం: ఖమ్మంలోని ఎన్టీఆర్ విగ్రహం సమీపాన పెట్రోల్ బంక్ వెనుక కాలనీలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. కాలనీకి చెందిన గుండ్ల ఝాన్సీ(26)కి గతంలో వివాహం జరగగా విడాకులు తీసుకున్నారు. మళ్లీ ఆమెకు వివాహం చేసేందుకు కుటుంబీకులు నిర్ణయించారు. ఏం జరిగిందో తెలియదు కానీ ఆమె మంగళవారం రాత్రి ఇంట్లోని గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న ఖమ్మం టూ టౌన్ పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆన్‌లైన్ చెల్లింపులకు ప్రాధాన్యం

- విద్యుత్ బిల్లుల వసూళ్లపై అధికారుల దృష్టి
- వినియోగదారుల్లో అవగాహన పెంచేలా చర్యలు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ బిల్లుల చెల్లింపును సులభతరం చేస్తూ తీసుకొచ్చిన ఆన్‌లైన్ విధానంపై వినియోగదారులకు అవగాహన కల్పించేలా అధికారులు దృష్టి సారించారు. బిల్లుల చెల్లింపు కోసం శాఖ రెవెన్యూ విభాగం ప్రత్యేక కౌంటర్లు నిర్వహిస్తుండగా.. సాంకేతిక పరిజ్ఞానం పెరగటంతో అన్ని బిల్లులతో పాటే విద్యుత్ బిల్లులను కూడా ఆన్‌లైన్‌లో చెల్లించే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. దీంతో 2013లో విద్యుత్ శాఖ ఈ విధానాన్ని ప్రారంభించగా.. ఎన్పీడీసీఎల్ పరిధిలో ఇప్పటివరకు దాదాపు 13 లక్షల మంది డిజిటల్ విధానంలో ఆన్‌లైన్ చెల్లింపులు చేస్తున్నారు. అయితే, ఈ సంఖ్య మరింత పెంచేలా వినియోగదారుల్లో అవగాహన కల్పించేందుకు అధికారులు రంగంలోకి దిగారు.

పోస్టర్ల ద్వారా ప్రచారం

ఆన్‌లైన్‌లోనూ బిల్లులు చెల్లించొచ్చని.. తద్వారా వ్యయప్రయాసాలు తప్పుతాయనే అంశంపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు విద్యుత్ శాఖ అధికారులు పోస్టర్లను రూపొందించారు. వీటిని మంగళవారం ఖమ్మం విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయంలో అధికారులు ఆవిష్కరించగా అన్ని రెవెన్యూ కార్యాలయాల వద్ద అంటించాలని నిర్ణయించారు. డిజిటల్ చెల్లింపుల విధానంలోనూ రశీదు పొందొచ్చని, గత బిల్లుల వివరాలు తెలుసుకోవడం, గడువు తేదీకి ముందు మెసేజ్ వచ్చేలా సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని చెబుతూ పోస్టర్లలో వివరాలు ముద్రించారు. ఈ సందర్భంగా ఖమ్మం విద్యుత్ శాఖ సర్కిల్ ఆపరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎ.సురేందర్ మాట్లాడుతూ టీఎస్ ఎన్పీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారానే యాప్ ద్వారా బిల్లులు చెల్లించొచ్చని తెలిపారు. సులభమైన ఈ విధానాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్కిల్ అకౌంట్స్ అధికారి శ్రీధర్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపు కేంద్ర మంత్రి పర్యటన


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

మధిర: కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి నారాయణస్వామి ఈనెల 19న మధిరలో పర్యటించనున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తెలిపారు. మధిరలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం కార్యకర్తలు ఇప్పటి నుంచే కష్టపడాలని సూచించారు. కేంద్రప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వివరిస్తే విజయం సాధించొచ్చని తెలిపారు. కాగా, గురువారం కేంద్ర మంత్రి నారాయణ స్వామితో ఆంధ్రప్రదేశ్ సంఘటన్ ప్రధాన కార్యదర్శి మధుకర్ కూడా మధిర పర్యటనకు వస్తారని, వీరికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలకాలని సత్యనారాయణ కోరారు. ఈ సమావేశంలో మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, నాయకులు పెరుమాళ్లపల్లి విజయరాజు, శ్యాం, చిలువేరు సాంబశివరావు, పాపట్ల రమేష్, కుంచం కృష్ణారావు, దేవరకొండ కోటేశ్వరరావు, తాళ్లూరి సురేష్, రామయోగేశ్వరరావు, బియ్యవరపు రామకృష్ణ, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీల మార్పుపై మాట్లాడే అర్హత లేదు


మాట్లాడుతున్న దుర్గాప్రసాద్, పక్కన నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: పార్టీ ఫిరాయింపులపై మంత్రి పువ్వాడ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. మంత్రి తొలిసారి గెలిచింది కాంగ్రెస్ నుంచేనన్న విషయాన్ని మరిచిపోవద్దని సూచించారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, కార్పొరేటర్లు కమర్తపు మురళి, మిక్కిలినేని మంజుల మాట్లాడుతూ త్వరలోనే బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో దొబ్బల సౌజన్య, లకావత్ సైదులునాయక్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, రఫీదాబేగం, పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు బొందయ్య, ముజాహిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటిస్తున్న కేంద్ర అధికారులు


కారేపల్లి: పల్లె దవాఖానాలో వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

బోనకల్: సంక్షేమ పథకాల అమలును పరిశీలించేందుకు జిల్లాకు కేంద్రప్రభుత్వ ట్రెయినీ అధికారులు (అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు) వచ్చారు. వీరు బృందాలుగా విడిపోయి బోనకల్ మండలం ముష్టికుంట్ల, కారేపల్లి మండలం భాగ్యనగర్ తండా గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఈమేరకు మంగళవారం ముష్టికుంట్లలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన అధికారులు కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శులు రఘు, అర్జున్ పాల్గొన్నారు. కాగా, కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా గ్రామంలో పర్యటిస్తున్న బృందం పల్లె దవాఖానాలను సందర్శించింది. ఈ కేంద్రాల ద్వారా అందుతున్న వైద్యంపై వైద్యులతో చర్చించాక చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఉసిరికాయలపల్లిలోని శ్రీకోటమైసమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించాక గ్రామ రైతులతో సమావేశమై పంటల సాగు, దిగుబడిపై ఆరా తీశారు. గ్రామ సర్పంచ్ సుజాత, కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

'తోడు' అధ్యక్షుడికి అవార్డు


మనోహర్‌ను సత్కరిస్తున్న ఫౌండేషన్ బాధ్యులు

వైరా: యువకులతో రక్తదానం చేయించిన వైరాకు చెందిన తోడు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు నందిగామ మనోహర్‌కు శ్రీనివాస రామానుజం ఫౌండేషన్ బాధ్యులు ఉత్తమ సేవా అవార్డు ప్రకటించారు. ఈ సందర్భంగా ఖమ్మంలో నిర్వహించిన సమావేశంలో ఆయనకు ఫౌండేషన్ అధ్యక్షుడు తుమ్మా అమరేష్‌తో పాటు కొమ్మిన్ని కిషోర్, మేడా మోహనరావు, నర్సింహారావు, దాసరి రమేష్ తదితరులు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు.

పులి సంచారం పుకార్లే...


పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

వేంసూరు: మండలంలో పులి సంచరిస్తోందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని సత్తుపల్లి రేంజర్ స్నేహలత తెలిపారు. మండలంలోని సత్యనారాయణపురం, అమ్మపాలెం, కుంచపర్తిల్లో రేంజర్ ఆధ్వర్యాన అటవీ శాఖ అధికారులు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పొలాల్లో పాదముద్రలను చూపించగా పరిశీలించి అవి పులివి కావని, పులిని పోలిన మచ్చలతో ఉండే తోడేలు జాతి జంతువుల పాదముద్రలని ఎవరూ భయపడాల్సిన పని లేదని.. కొన్నాళ్లు మేకలు, గొర్రెలు కాపరులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈకార్యక్రమంలో అధికారులు దీపక్, వెంకటేశ్వర్లు, మంగారావు, తదితరులు పాల్గొన్నారు.

మాతృభూమి కోసం పోరాడడం తీవ్రవాదం కాదు..


ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మాతృభూమి కోసం పాలస్తీనా పోరులు చేస్తున్న యుద్ధాన్ని తీవ్రవాదంగా పరిగణించడం సరికాదని ప్రపంచ శాంతి సంఘీభావ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుబ్బారావు, గడల భాస్కరరావు అన్నారు. పాలస్తీనా–ఇజ్రాయిల్ యుద్ధాన్ని వెంటనే ఆపేలా ప్రయత్నించాలని కోరుతూ ఖమ్మంలోని జెడ్పీసెంటర్‌లో మంగళవారం చేపట్టిన ర్యాలీలో వారు మాట్లాడారు. పాలస్తీనా, ఇజ్రాయిల్ యుద్ధానికి సంబంధించి ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడగా వివిధ పార్టీల నాయకులు వై.విక్రమ్, శింగు నర్సింహారావు, యర్రా శ్రీనివాసరావు, ఎం.ఏ.జబ్బర్, షేక్ బషీరుద్దీన్, మెరుగు సత్యనారాయణ, ఎం.ఏ.ఖయ్యూం, అఫ్రోజ్ సమీనా, మీరా, నవీన్‌రెడ్డి, పోటు కళావతి, సీతామాలక్ష్మి, మేకల శ్రీనివాస్, శివరామకృష్ణ, రాము, సుబ్బారావు, రవి పాల్గొన్నారు.

వ్యాపారులు, వైద్యులతో తుమ్మల భేటీ


వాసవీ ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నుంచి పోటీ చేయడం ఖరారైందని తెలుస్తుండగా ఆయన మంగళవారం నగరంలో పలువురు ప్రముఖులను కలిశారు. కార్పొరేటర్ కమర్తపు మురళి, సాధు రమేష్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కలిసి పనిచేద్దామని చెప్పగా.. కాంగ్రెస్ టికెకెట్ ఎవరికి వచ్చినా గెలుపునకు కృషిచేస్తానని జావీద్ తెలిపారు. అనంతరం నిర్మల్ హృదయ్ పాఠశాల అధినేత వంగా సాంబశివరెడ్డిని తుమ్మల కలవగా, నామినేషన్ ఖర్చుల కోసం రూ.10,116 అందజేశారు. ఆతర్వాత యువం పౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, వైద్యులు ఎంఎఫ్.గోపీనాథ్, గంగరాజు, మహేంద్రకుమార్ కలవడమే కాక ఆర్యవైశ్య సంఘం నాయకుడు మేళ్ళచెర్వు వెంకటేశ్వరరావు తదితరులలో కలిసి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో దేవీశరన్నవరాత్రుల సందర్భంగా పూజలు చేశారు.

సుబ్లేడులో షోయబుల్లాఖాన్ జయంతి


షోయబుల్లాఖాన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: నైజాం రజాకార్ల ఆగడాలపై తన రచనల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసిన మండలంలోని సుబ్లేడు గ్రామానికి చెందిన తొలితరం కలంయోధుడు షోయబుల్లాఖాన్ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని ఆయన విగ్రహం వద్ద వివిద పార్టీల నాయకులు నివాళులర్పించారు. షోయబుల్లాఖాన్ సుబ్లేడు వాసి కావడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జియావుద్దీన్, భూక్యా వీరన్న, వనవాసం నర్సింహారెడ్డి, వీరన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సతీష్ (ఫైల్)

వేంసూరు: బస్సును వెనుక నుంచి ఢీకొట్టగా కారు బోల్తా పడి డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి మృతి చెందాడు. వేంసూరు మండలం లింగపాలెం శివారులో మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉనానయి. ఏపీలోని చింతలపూడి మండలం శివాపురం గ్రామానికి చెందిన కలపాల సతీష్(34) కారులో సత్తుపల్లి నుంచి వేంసూరు వైపు వెళ్తున్నాడు. ఈక్రమంలో సత్తుపల్లి డిపో బస్సు విజయవాడ నుంచి సత్తుపల్లి వెళ్తుండగా లింగపాలెం వద్ద బస్సు వెనుక భాగంలో కారు ఢీకొట్టింది. దీంతో కారు అదుపు తప్పి సమీప పొలాల్లోకి దూసుకువెళ్లి పల్టీ కొట్టడంతో కారు నడుపుతున్న సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని ఎస్ఐ వీరప్రసాద్ తెలిపారు.

రూ.6.62లక్షల నగదు స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మంలో త్రీటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో చేపట్టిన తనిఖీల్లో రూ.4.12లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక వ్యాపారి ద్విచక్రవాహనంపై డబ్బు తీసుకెళ్తుండగా తనిఖీల్లో గుర్తించారు. ఆయన వద్ద సరైన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

రూ.1.50లక్షలు...

కల్లూరు: విజయవాడ నుంచి వైరాకు వెళ్తున్న వ్యక్తుల వద్ద నుంచి రూ.1.50లక్షల నగదును పోలీసులు సీజ్ చేశారు. మండలంలోని కల్లూరు షుగర్ ఫ్యాక్టరీ సమీపాన ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపట్టగా ఎలాంటి పత్రాలు లేకుండా నగదు తీసుకెళ్తుండడంతో సీజ్ చేశామని ఎస్ఐ పి.రఘు తెలిపారు.

తల్లాడలో రూ.లక్ష

తల్లాడ: ఎలాంటి అనుమతులు లేకుండా ఆర్టీసీ బస్సులో రూ.లక్ష తీసుకెళ్తుండగా ఎస్ఐ పి.సురేష్ స్వాధీనం చేసుకున్నారు. సత్తుపల్లి నుంచి ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ బస్సులో అశ్వారావుపేటకు చెందిన షేక్ వాజిద్ రూ.లక్ష తీసుకెళ్తుండగా గుర్తించామని, ఆయన వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశామని ఎస్ఐ వెల్లడించారు.

రూ.4,600 విలువైన మద్యం..

కామేపల్లి: మండలంలోని ముచ్చర్లకు చెందిన షేక్ మౌలా బెల్ట్ షాపులో నిల్వ ఉంచిన రూ.4,600 విలువైన మద్యాన్ని మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు తనిఖీల్లో మద్యాన్ని గుర్తించి ఆయనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరంలోని దానాయిగూడెంకు చెందిన బొట్టు తిరుమల(42) అనారోగ్య సమస్యతో బాధపడుతూ అధిక మోతాదులో బీపీ మాత్రలు మింగగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. నేలకొండపల్లికి చెందిన తిరుమలకు దానవాయిగూడెంకు చెందిన ప్రసాద్‌తో 2007లో వివాహం జరిగింది. కొన్నేళ్లుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతుండడంతో చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో ఈనెల 15న బీపీ మాత్రలు మింగిన ఆమెను కుటుంబీకులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి...


రఘునాథపాలెం: మండలంలోని రాములుతండాకు చెందిన టి.భద్రు(35) పురుగుల మందు తాగగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. తండాకు చెందిన భద్రు ఇంటి బాధ్యత పట్టించుకోకపోవడంతో అప్పులు ఎలా తీరతాయని తల్లి, భార్య మందలించారు. దీంతో ఆయన ఈనెల 10న ఊరి చివరలో పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి చెప్పాడు. ఈమేరకు ఆయనను ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందడంతో కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం సీఐ కె.శ్రీధర్ తెలిపారు.

డెంగీతో మహిళ..

నేలకొండపల్లి: డెంగీ బారిన పడిన మహిళ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. నేలకొండపల్లికి చెందిన కొవ్వూరి ధనలక్ష్మి(52) వారం రోజులుగా జ్వరంతో బాధపడుతూ స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో రెండు రోజుల క్రితం ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా డెంగీగా నిర్ధారించారు. అక్కడే చేర్పించడంతో చికిత్స పొందుతూ మంగళవారం ఆమె మృతి చెందింది.

ఇదే చివరి ప్రయాణం

- రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి
- ఉపాధి కోసం వలస వచ్చి కన్నుమూత


హీరాలాల్, జయరాజ్ మృతదేహాల వద్ద పోలీసులు, అన్నం ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: సొంత అన్నదమ్ములైన వారికి స్వస్థలంలో ఉపాధి లేక ఎన్నో ఆశలతో ఇక్కడకు వచ్చారు. రూపాయి, రూపాయి కూడబెట్టి కుటుంబానికి పంపిస్తూ పొట్ట పోసుకుంటున్నారు. పనిలో భాగంగానే వెళ్లి వస్తున్న వారిద్దరికి అదే చివరి ప్రయాణమైంది. మరో రోజును చూడకుండానే వారిద్దరు రోడ్డుప్రమాదంలో కన్నుమూశారు. ఖమ్మంలోని బల్లేపల్లి వద్ద ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం వివరాలిలా ఉన్నాయి.

గ్లాస్ ఫిట్టింగ్ పనులు కోసం...

ఉత్తరప్రదేశ్‌రాష్ట్రంలోని మహారాజు గంజ్ జిల్లా కర్మహా గ్రామానికి చెందిన అన్నదమ్ములైన హీరాలాల్(30), జయరాజు(28) ఆరేళ్ల క్రితం ఖమ్మం వచ్చారు. పెద్ద భవనాలకు గ్లాస్ ఫిట్టింగ్ పనుల్లో నిష్ణాతులైనవారు ఇక్కడ పనిచేస్తున్నారు. వీరిద్దరు పని నిమిత్తం మణుగూరు వెళ్లి సోమవారం రాత్రి లేల్యాండ్ ట్రక్కులో ఖమ్మం బయల్దేరారు. మంగళవారం తెల్లవారుజామున ఖమ్మం శివారు బల్లేపల్లి వద్దకు చేరుకున్న వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో హీరాలాల్, జయరాజుకు తీవ్రగాయాలు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఖానాపురం హవేలీ ఎస్సై వెంకన్న చేరుకుని అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది సహకారంతో మృతదేహాలను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి వారి కుటుంబీకులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు. కాగా, పొట్టకూటి కోసం వచ్చి వలస వచ్చిన అన్నదమ్ములు ఒకే ప్రమాదంలో కన్నుమూయడం వారి కుటుంబంలో విషాదాన్ని నింపినట్లయింది.

119మందిపై బైండోవర్ కేసులు

ముదిగొండ/తిరుమలాయపాలెం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యాన శాంతిభద్రత పరిరక్షణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 60మంది బెల్టుషాప్ నిర్వాహకులతో పాటు 40మంది వివిధ పార్టీల నాయకులను మంగళవారం బైండోవర్ చేశారు. వీరిని తహసీల్దార్ రామారావు ఎదుట హాజరుపర్చి సొంత పూచీకత్తుపై విడుదల చేశామని ఎస్ఐ నరేష్ తెలిపారు. అలాగే, తిరుమలాయపాలెం మండలంలోని తాళ్లచెరువు, గోపాలపురం, తిమ్మక్కపేటల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న 19మందిని తహసీల్దార్ రాంప్రసాద్ ఎదుట బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.